కష్టపడి పని చేసే వారికి గుర్తింపు


నియామకపత్రాలను అందజేస్తున్న సబితా ఇంద్రారెడ్డి, కార్తీక్‌రెడ్డి

బండ్లగూడ: మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులుగా రావులకోళ్ల నాగరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మంద రవీందర్‌రెడ్డిలను నియమించారు. ఈ మేరకు బుధవారం బీఆర్‌ఎస్ యువనాయకుడు కార్తీక్‌రెడ్డితో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి కలిసి ఎన్నికైన వారికి నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పార్టీ కోసం ప్రజల కోసం నిరంతరం పని చేస్తూ కార్పొరేషన్‌లో పార్టీని మరింత అభివృద్ధి చేయాలని, ప్రజల వెంటే ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కష్టపడి పని చేసే వారిని బీఆర్‌ఎస్ పార్టీ తప్పకుండా గుర్తించి వారికి పదవులు అప్పగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

నేషనల్ స్పోర్ట్స్ మీట్ ఐఐటీలో ఎంపికైన విద్యార్థులు


ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ టీపీవి శర్మ

మైలార్‌దేవ్‌పల్లి: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా కాన్పూర్‌లో సెప్టెంబర్ 11 నుంచి 15 వరకు జరిగే కేవీఎస్ 53వ నేషనల్ స్పోర్ట్స్ మీట్ ఐఐటీలో పాల్గొనేందుకు శివరాంపల్లి కేంద్రియ విద్యాలయం నుంచి 7 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఆశిష్ నేహ్రా (11వ తరగతి)బాస్కెట్ బాల్, వివేక్ రావత్ (11బి) బాస్కెట్ బాల్, భవ్య (9సీ)బాస్కెట్ బాల్, రోష్ని తాపా(11బి)బాస్కెట్ బాల్, శ్రీకాంత్ (11బి)బాస్కెట్ బాల్, నామస్ (11బి)బాక్సింగ్, తుషార్ (8ఏ)అథ్లెటిక్స్ రాష్ట్ర స్థాయిలో విజయం సాధించి వీరు జాతియ స్థాయిలో ఎంపికయ్యారు. దీంతో ప్రిన్సిపాల్ డాక్టర్ టీపీవి శర్మ, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ప్రవీణ్ కుమార్ విద్యార్థులను ప్రోత్సహించి అభినందించారు.

ఉత్తమ ఫలహారపు బండి ఊరేగింపు అవార్డు


ఉత్తమ ఫలహారపు బండి ఊరేగింపు అవార్డును అందుకుంటున్న గౌతమ్

రాజేంద్రనగర్: ఉజ్వల సంస్కృతిక సామాజిక స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో లష్కర్ బోనాల అవార్డుల ఉత్సవంలో రాజేంద్రనగర్‌కు చెందిన గౌతమ్‌కు ఉత్తమ ఫలహారపు బండి ఊరేగింపు అవార్డు దక్కింది. ఈ అవార్డును నగరంలో జరిగిన ఓ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు గౌతమ్‌కు అందజేసి ఘనంగా సన్మానించారు. గత 25 సంవత్సరాలుగా గౌతమ్ ఆధ్వర్యంలో ఫలహారపు బండిని రాజేంద్రనగర్‌లో ఊరేగిస్తున్నారు. ఈ సందర్భంగా గౌతమ్ మాట్లాడుతూ.. తమ ఫలహారపు బండి ఊరేగింపును గుర్తించి అవార్డు ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మోడల్ స్కూల్‌లో మాక్ పోలింగ్


మోడల్ స్కూల్‌లో నిర్వహించిన మాక్ పోలింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు

శంషాబాద్ రూరల్: మండలంలోని పాల్మాకులలో ఉన్న మోడల్ స్కూల్‌లో బుధవారం విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించారు. విద్యార్థులకు ఓటు విలువ తెలుపడంతో పాటు నాయకత్వ లక్షణాలు పెంపొందించడానికి మాక్ పోలింగ్ దోహదపడుతుందని ప్రిన్సిపాల్ విష్ణుప్రియ తెలిపారు. స్కూల్ హెడ్ బాయ్, హెడ్ గర్ల్, కెప్టెన్, వైస్ కెప్టెన్ పదవులకు 36 మంది పోటీ పడ్డారు. ఆయా అభ్యర్థులను విద్యార్థులు ఓటు హక్కు వినియోగించి ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఓటు హక్కు, ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సోషల్ మీడియా ఇంచార్జి సుశీలరాణి, సరిత, ప్రసన్న రాణి, శీతల్, తదితరులు పాల్గొన్నారు.

ఎంజీఐటీ సహాయ ప్రొఫెసర్‌కు డాక్టరేట్


ప్రొఫెసర్ సంతోష్ కుమార్

మణికొండ: గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ) ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో సహాయ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న సంతోష్‌కుమార్‌కు ఉస్మానియా యూనివర్శిటీ డాక్టరేట్ ప్రధానం చేసింది. టాగుచి డోయి మెథడ్ రెండింటినీ ఉపయోగించటం ద్వారా రెసిప్రొకేటింగ్ కంప్రెసర్‌లో సక్షన్ మఫ్లర్ ఆప్టిమైజేషన్ అనే అంశంపై ఆయన సమర్పించిన పత్రాలకు అనుగుణంగా డాక్టరేట్‌ను ప్రధానం చేసింది. సీనియర్ ప్రొఫెసర్ కిషోర్, ఉషశ్రీల పర్యవేక్షణలో పీహెచ్‌డీ డిగ్రీ పూర్తి చేయటంతో డాక్టరేట్ డిగ్రీ ప్రధానం చేసినట్టు ఆయన తెలిపారు.

నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి

చార్మినార్: అమ్మవారి విగ్రహాల ధ్వసం కేసులో నిందితులను కఠినంగా శిక్షించడంతో పాటు ఇలాంటి ఘటనలు పునరావతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య, మాజీ చైర్మన్ రాకేష్ తివారీ డిమాండ్ చేశారు. రక్షాపురంలోని ఆలయాన్ని సందర్శించిన వారు దేవాదాయ శాఖ వెంటనే స్పందించి ఆలయాన్ని పునః నిర్మాణం చేయాలని కోరారు. రాజకీయ ఒత్తిడుతకు తలొగ్గకుండా తగిన చర్యలు తీసుకోవాలని వారు నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డిని కోరారు.

విద్యా సౌధాల్లో

'సౌర'భాలు

విద్యుత్ బిల్లులు ఆదా చేస్తున్న హెచ్‌సీయూ

- రూఫ్‌టాప్ సోలార్ పవర్ ఉత్పత్తికి 2013లో శ్రీకారం
- దేశంలోనే మొదటి యూనివర్సిటీగా గుర్తింపు


హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ భవనంపై సోలార్ ఫలకాలు


రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో సోలార్ పవర్ వెలుగులు విరజిమ్ముతున్నాయి. విద్యుత్ వ్యయాన్ని గణనీయంగా తగ్గించేందుకు పదకొండేళ్ల క్రితమే శ్రీకారం చుట్టడం విశేషం. క్యాంపస్‌లో పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించుకునేలా.. సోలార్ పవర్ ఉత్పత్తిని మరింత పెంచేందుకు కూడా ప్రణాళికలు రూపొందించి ముందుకుసాగుతున్నారు. ప్రస్తుతానికి పరిమితంగా సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తిని చేస్తున్నా భవిష్యత్తులో పూర్తిగా వినియోగించుకునేలా అవసరమైన ప్రణాళికలను రచించి అందుకు తగిన అనుమతుల కోసం ఎదురుచూస్తున్నారు.

- హెచ్‌సీయూలో 2013లో రూఫ్‌టాప్ సోలార్ సిస్టమ్‌ను లాంఛనంగా ప్రారంభించారు.
- యూనివర్సిటీ పరిపాలనా భవనం, ఫైనాన్స్ బిల్డింగ్, హెల్త్ సెంటర్, సీఐఎస్ బిల్డింగ్, ఐజీఎం లైబ్రరీ, స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్, స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్, స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ భవనాలపై సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసి ఉత్పత్తి సాగిస్తున్నారు.


సోలార్ పవర్‌ప్లాంట్ కంట్రోల్ రూమ్‌ను ప్రారంభిస్తున్న అప్పటి వీసీ రామకృష్ణ (ఫైల్)

- సోలార్ పవర్ ఉత్పత్తికి సౌరఫలకాలు, ఇన్వర్టర్లు, మౌంట్ సిస్టమ్స్, ఎలక్ట్రికల్ భాగాలు వినియోగిస్తారు
- క్యాంపస్‌లో ప్రస్తుతం 1000 కేడబ్ల్యూపీ సోలార్ పవర్ ఉత్పత్తికి ప్యానల్స్‌ను వినియోగిస్తున్నారు.
- హెచ్‌సీయూ క్యాంపస్ అంతటా ప్రస్తుతం ఈ సిస్టమ్ ద్వారా సరాసరి నెలకు 83,862.89 కేడబ్ల్యూహెచ్ ఉత్పత్తి చేస్తున్నారు.
- సూర్యకాంతి నుంచి ఫోటాన్లను సౌరఫలకాలు గ్రహించి సెమి కండక్టర్‌లో ఎలక్ట్రాన్‌లను ఉత్తేజపరిచి విద్యుత్‌ను సృష్టిస్తుంది.
- ఆ తర్వాత ఇన్వర్టర్ల సహాయంతో ఉత్పత్తి అయిన విద్యుత్‌ను వినియోగించుకుంటున్నారు.

విద్యుత్ వ్యయం తగ్గించుకోవడానికి..



- క్యాంపస్‌లో విద్యుత్ వ్యయాన్ని తగ్గించేందుకే సోలార్ పవర్ ఉత్పత్తికి శ్రీకారం చుట్టారు.
- హెచ్‌సీయూలో నెలకు రూ.7.36 లక్షల విద్యుత్ బిల్లు వ్యయాన్ని తగ్గిస్తోంది.
- భవిష్యత్‌లో మరిన్ని భవనాలకు సోలార్ పవర్ ఉత్పత్తి చేయాలనే ప్రణాళిక ఉంది
- భారతదేశంలోనే 100 కేడబ్ల్యూ సౌర విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసిన మొదటి విశ్వవిద్యాలయ లైబ్రరీగా హెచ్‌సీయూ గుర్తింపు పొందింది. 1988 అక్టోబర్ 21న అప్పటి ఉపరాష్ట్రపతి శంకర్‌దయాళ్‌శర్మ ప్రారంభించారు.
- ఈ సోలార్ పవర్ ప్లాంట్ 1.14 మెగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటు చేశారు.దీన్ని రికార్డుస్థాయిలో కేవలం 30 రోజులలో ఏర్పాటు చేయడం మరో విశేషం.
- ఏడాదికి 21,11,358 కిలోవాట్ల సౌరవిద్యుత్ ఉత్పత్తి చేయాలని సంకల్పించారు.
- లైబ్రరీ తన అంతర్గత కార్యకలాపాలన్నింటినీ కంప్యూటరీకరించిన మొదటి లైబ్రరీ. భారతదేశంలో ఎలక్ట్రానిక్ జర్నల్‌లు, డేటాబేస్‌లకు సభ్యత్వాన్ని పొందింది. పదేళ్లు గడిచినా ఇప్పటికీ విజయవంతంగా ఈ ప్లాంట్ కొనసాగడం విశేషం.
- భవిష్యత్తులో క్యాంపస్‌లో మరిన్ని భవనాలపై కూడా సోలార్ ప్యానల్స్ ఏర్పాటుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

ప్రధానోపాధ్యాయుడికి ఘనంగా వీడ్కోలు


ప్రధానోపాధ్యాయుడిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

శంషాబాద్ రూరల్: బదిలీపై వెళ్లిన ప్రధానోపాధ్యాయుడికి ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. మండలంలోని రామంజాపూర్‌తండా ప్రధానోపాధ్యాయుడు దత్తంరెడ్డి బదిలీ కాగా.. బుధవారం ఆయనను ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ మండల ప్రధాన కార్యదర్శి వెంకటరమణగౌడ్, సంఘ నాయకులు గణేష్, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ వార్డు సభ్యులు పాండు, తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్ చేయాలి



రాజేంద్రనగర్: రాజేంద్రనగర్, అత్తాపూర్, మైలార్ దేవ్‌పల్లి, సులేమాన్‌నగర్, శాస్త్రిపురం డివిజన్లకు చెందిన ఫాగింగ్ సిబ్బందితో బుధవారం జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ ఉపకమిషనర్ రవికుమార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దోమల నిర్మూలన కోసం ఫాగింగ్‌ను ప్రతి కాలనీలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో సిబ్బందికి పలు ఆదేశాలు జారీచేశారు. ప్రతిరోజు తమకు కేటాయించిన ప్రాంతంలో వాకింగ్ నిర్వహించాలని, పార్కింగ్ నిర్వహించిన కాలనీ బస్తీలలోని వారి సంతకాలను తీసుకోవాలన్నారు. ఎక్కడ ఎలాంటి ఫిర్యాదు లేకుండా పనులను నిర్వహించాలని సూచించారు.

నేడు పుస్తకావిష్కరణ

రాయదుర్గం: ఖాజాగూడ ఓక్రిడ్జ్ పాఠశాలలో గురువారం పాఠశాల కో ఫౌండర్, సీఈఓ నాగ తుమ్మల రచించిన 'షామిదాస్‌– ది మ్యాన్ హూసా టుమారో' పుస్తకావిష్కరణ జరుగుతుంది. ఈ కార్యక్రమం అధ్యక్షుడు రాజ్ యార్లగడ్డ ఆధ్వర్యంలో సాయంత్రం 6.30 గంటలకు మిజోరం గవర్నర్ కె హరిబాబు చేతుల మీదుగా ఆవిష్కరిస్తారు. కార్యక్రమంలో శంతనూ చౌదరి, షామీదాస్, హరికిరణ్ వడ్లమాని పాల్గొంటారు.

అంతరించిపోతున్న కళలు, సాహిత్యాన్ని కాపాడాలి



సదస్సులో పుస్తకాలను ఆవిష్కరించిన వీసీ ఐనుల్ హసన్

మనూ వీసీ ప్రొ.సయ్యద్ ఐనుల్ హసన్

రాయదుర్గం: అంతరించిపోయే కళ, సాహిత్యాన్ని ప్రపంచీకరణ ద్వారా మళ్లీ నిలబెట్టుకోవాల్సిన అవసరం ఉందని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ అభిప్రాయపడ్డారు. మనూలో 'వాయిసెస్ ఆఫ్ ఇండియా అండ్ బియాండ్: మొబిలిటీ, సస్టేనబిలిటీ అండ్ టెక్నాలజీ' అనే అంశంపై మూడు రోజుల అంతర్జాతీయ సదస్సును ఇంగ్లిష్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ కమ్యూనిటీలు తమ గుర్తింపులను, చరిత్రలను భాషల ద్వారా ఎలా తిరిగి పొందవచ్చో అన్వేషించాలన్నారు. అనంతరం పలు చర్చా కార్యక్రమాలు జరిగాయి .కార్యక్రమంలో 'మనూ' రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్, ఇంగ్లిష్ విభాగాధిపతి ప్రొఫెసర్ కె నాగేంద్ర, హెచ్‌సీయూ ప్రొఫెసర్ ఎస్ అరుల్మోజి, ప్రొఫెసర్లు ఉమారాణి పప్పుస్వామి, ప్రొఫెసర్ ప్రభాకర్‌రావు, ప్రొఫెసర్ అజీజ్‌బానో ప్రసంగించారు.

'జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తాం'


ఫుట్‌బాల్ టోర్నమెంట్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శివసేనారెడ్డి, జితేందర్ రెడ్డి తదితరులు

గచ్చిబౌలి: జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించబోతున్నట్లు తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కె.శివసేనారెడ్డి తెలిపారు. బుధవారం ఎల్బీస్టేడియంలో ఇంటర్ కాంటినెంటల్ ఫీఫా కప్పు 2024 ఫుట్‌బాల్ టోర్నమెంట్ పోస్టర్, బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గచ్చిబౌలి స్టేడియంలో జరగబోయే ఫుట్‌బాల్ క్రీడలకు నగరం ఆధిక్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇండియ, మారిసెస్ దేశాల మధ్య సెప్టెంబర్ 3వ తేదీ నుంచి జరుగనున్న పోటీలకు స్పోర్ట్స్ అథారిటీ తరపునా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈనెల 29న జాతీయ క్రీడా దినోత్సవ వేడుకల్లో మంత్రులు, కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారులు జితేందర్‌రెడ్డి, తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి పాల్గుణ, క్రీడాశాఖ అధికారులు అనురాధ, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య సిబ్బంది సేవలు ఎంతో గొప్పవి


సరుకులు పంపిణీ చేస్తున్న మేయర్ లతాప్రేమ్‌గౌడ్ తదితరులు

బండ్లగూడ: హిమాయత్‌సాగర్ కార్యాలయంలో పారిశుద్ధ్య సిబ్బందికి చీరలు, చొక్కా, ప్యాంట్, సబ్బులు, రెయిన్ కోట్లు, స్వెటర్, రేడియం జాకెట్స్, షూ, చెప్పులు, కొబ్బరినూనె లీటర్, హ్యాండ్ గ్లౌజ్, టవల్స్‌ను బుధవారం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ లతాప్రేమ్‌గౌడ్, డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పారిశుద్ధ్య సిబ్బంది విధులు నిర్వహించే సమయంలో జాగ్రత్తలు వహించాలని, తమ ఆరోగ్యాలను కాపాడుకునేందుకు మాస్కులు, గ్లౌజ్‌లు, షూ తదితర వాటిని ఎల్లప్పుడూ ధరించాలన్నారు. సిబ్బందికి ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని, వారికి మెరుగైన సేవలు అందించేందుకు, సమస్యలు పరిష్కరించేందుకు తాము ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు అస్లాంబిన్ అబ్దుల్లా, ప్రశాంత్ నాయక్, ముద్దం రాము, రవీందర్‌రెడ్డి, తలారి చంద్రశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్, శానిటరీ జవాన్లు సురేష్, యాదగిరి, స్వీపర్లు, డ్రైవర్లు, కామాటిలు తదితరులు పాల్గొన్నారు.

బస్టాప్ ఏర్పాటుకు వినతి

రాజేంద్రనగర్: శివరాంపల్లి పీవీఎన్‌ఆర్ ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్ నంబర్ 274 వద్ద ప్రయాణికుల సౌకర్యార్థం బస్టాపును ఏర్పాటు చేయాలని శివరాంపల్లి ఐక్యత వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం రాజేంద్రనగర్ ఆర్టీసీ డిపో మేనేజర్ బద్రినాథ్‌కు వినతిపత్రం సమర్పించారు. పిల్లర్ నంబర్ 274 వద్ద బస్సు షెల్టర్ లేక ప్రయాణికులు రోడ్డు పై నిలబడి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఇదే ప్రాంతంలో యూ టర్న్ కూడా ఉండటంతో పాటు వేగంగా వచ్చే వాహనాలతో ఎప్పుడేం ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం విద్యార్థులు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగస్తులు ఇతర ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారన్నారు. గతంలో ఇక్కడ బస్సు షెల్టర్‌ను ఏర్పాటు చేయాలని విన్నవించడం జరిగిందని వివరించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ బద్రినాథ్ సానుకూలంగా స్పందిస్తూ.. ఈ బస్సు షెల్టర్ ఏర్పాటు జీహెచ్ఎంసీ పరిధిలో ఉంటుందని, జీహెచ్ఎంసీ అధికారులకు సైతం బస్సు షెల్టర్ ఏర్పాటుకు లేఖ రాస్తామని తెలిపారు. అందుకోసం జీహెచ్ఎంసీ అధికారులకు వినతిపత్రాన్ని ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు వెంకటేష్, ఉపాధ్యక్షులు ఆంజనేయులు, కార్యదర్శి ప్రకాష్ రెడ్డి, శ్రీధర్, సాంస్కృతిక కార్యదర్శి సిద్ధం శ్రీనివాస్, సభ్యులు భూమయ్య తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రాన్ని అందజేస్తున్న ఐక్యత వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు

యువకుడి అదృశ్యం


మాణిక్ సూర్యవంశీ (ఫైల్‌ఫోటో)

మైలార్‌దేవ్‌పల్లి: ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువకుడు కనిపించకుండా పోయిన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాటేదాన్ ప్రాంతానికి చెందిన మాణిక్ సూర్యవంశీ (20) వృత్తి లేబర్ పని చేస్తూ తల్లిదండ్రులతో జీవనం సాగిస్తున్నాడు. ప్రతి నిత్యం ఫోన్‌లో ఆన్‌లైన్ గేమ్‌లు ఆడుతూ ఉండేవాడు. ఈ నేపథ్యంలో లోన్ యాప్ నుంచి 3000 రూపాయలు అప్పు తీసుకొని గేమ్‌లో పోగొట్టుకోగా, తల్లిదండ్రులు అతన్ని మందలించారు. దీంతో మాణిక్ 15వ తేదిన ఉదయం ఇంట్లోని చెత్తను బయటపాడేసి వస్తానని చెప్పి వెళ్లాడు. ఎంతకీ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యుల ఇళ్లకు వెళ్లి విచారించినా ఫలితం లేకపోవడంతో పోలీసులుకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రెండో అంతస్తుపై నుంచి జారిపడి మేస్త్రీ మృతి

రాజేంద్రనగర్: ప్రమాదవశాత్తు రెండో అంతస్తుపై నుంచి జారిపడ్డ మేస్త్రీ మృతి చెందిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్‌కు చెందిన చెన్నయ్య (35) మేస్త్రిగా పనిచేసుకుంటూ బతుకుతెరువు కోసం భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి రాజేంద్రనగర్‌కు వలస వచ్చాడు. మాణిక్యమ్మ కాలనీలో నివాసముంటూ పని చేస్తున్నాడు. ఉదయ్ కాలనీలో రెండో అంతస్తులో జరుగుతున్న నిర్మాణ పనుల్లో బుధవారం ఉదయం పని చేస్తున్నాడు. ప్రమాదవశాత్తు జారిపడి తీవ్ర గాయాలు కాగా, వెంటనే తోటి కార్మికులు ఆసుపత్రికి తరలించారు. కానీ అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు వెల్లడించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

శానిటేషన్ పనుల తనిఖీ


అభివృద్ధి పనులపై చర్చిస్తున్న సర్కిల్ ఉపకమిషనర్ రవికుమార్, కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో శానిటేషన్ జాయింట్ ఇన్‌స్పెక్షన్‌ను బుధవారం నిర్వహించారు. రాజేంద్రనగర్ సర్కిల్ ఉపకమిషనర్ రవికుమార్, బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్రలు మాపెల్ టౌన్ గేట్–2, సాయి గోల్డెన్ వ్యాలీ కాలనీలో నూతన డ్రైనేజీ, రోడ్ల నిర్మాణం కోసం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు సమన్వాయంతో పని చేయడం జరుగుతుందన్నారు. అభివృద్ధి పనులు జరుగుతున్న సమయంలో ప్రజలు తమకు పూర్తి సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డిఈఈ శ్రీనివాసులు, కార్పొరేషన్ డిప్యూటీ ఈఈ యాదయ్య, ఏఈఈ రాజ్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్, బిల్ కలెక్టర్లు ఇమ్రాన్, అస్లాం, శానిటరీ జవాన్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కవితకు ఘన స్వాగతం పలికిన నాయకులు


ఎయిర్‌పోర్టులో కవితకు స్వాగతం పలికిన నాయకులు


కవితకు స్వాగతం పలికిన మహిళా నాయకులు

మణికొండ: ఢిల్లీ నుంచి హైదరాబాద్ చేరుకున్న బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కవితకు బుధవారం మున్సిపాలిటీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ధన్‌రాజ్, సీనియర్ నాయకుడు సీతారాం ఆధ్వర్యంలో నాయకులు పెద్ద ఎత్తున ఎయిర్‌పోర్టుకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. న్యాయ వ్యవస్థపై నమ్మకం ఉంచి పలు కోర్టులలో చేసిన పోరాటం ఫలించిందన్నారు. పలు రాజకీయ కారణాలతో ఆమెను జైలులో ఉంచినప్పటికీ ఎట్టకేలకు న్యాయం గెలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు రూపారెడ్డి, నాయకులు లక్ష్మన్‌రావు, శ్రీకాంత్, ఉపేంద్రనాథ్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, ఆరీఫ్, రామసుబ్బారెడ్డి, విజయలక్ష్మి, కీర్తిలతగౌడ్, రేఖ, సుమ, మంజు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో

ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ వెంకటరామిరెడ్డి


సమావేశంలో పాల్గొన్న నిర్వాహకులు

అత్తాపూర్: నవరాత్రి ఉత్సవాలను దృష్టిలో భాగంగా అత్తాపూర్ పోలీస్ స్టేషన్ లిమిట్స్ ఎంఎం పహాడిలో ఉన్న లక్కీ ప్యాలెస్‌లో బుధవారం సాయంత్రం నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కులమతాలకతీతంగా నిర్వహించుకునే విధంగా ఈ సంవత్సరం కూడా గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించుకునేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలను జరుపుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో క్రైం ఇన్‌స్పెక్టర్ రవి, ఎస్ఐ వెంకన్న, శ్రీను, నయిముద్దీన్, ఏఎస్ఐ వెంకటరమణ, కుమార్ యాదవ్, ప్రభాకర్ తదితరులు పాలొన్నారు.

గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ రఘుకుమార్

లంగర్‌హౌస్: గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని లంగర్‌హౌస్ ఇన్‌స్పెక్టర్ రఘుకుమార్ అన్నారు. గణేష్ మండపాల నిర్వాహకులతో ఆయన బుధవారం లంగర్‌హౌస్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..చట్టానికి సహకరిస్తూ, భక్తి భావంతో భావితరాలకు మన పండుగల విశిష్టతను తెలియజేసేలా ఉత్సవాలు నిర్వహించాలన్నారు. అర్ధరాత్రి ఊరేగింపులు ప్రారంభించి ప్రధాన రోడ్లపై మద్యం మత్తులో ఇతరులకు ఇబ్బంది కలిగేలా ఆడుతామంటే సహించేది లేదన్నారు. కొందరు గణేష్ మండపాల కోసం అనుమతి ఎందుకు తీసుకోవాలని అనుకుంటున్నారు.. ఇది అనుమతి కోసం కాదని, శాంతి భద్రతల పరిరక్షణ కోసమేనని ఆయన అన్నారు. జియోట్యాగ్, ఆన్‌లైన్ అనుమతి ఇచ్చి ఆర్టీఓ అధికారులతో మాట్లాడి అందరికీ వాహనాలు ఏర్పాట్లు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు రాఘవేంద్ర, రాజు నిర్వాహకులు ఇంద్రసేనారెడ్డి, నాగేంద్ర ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.